క్లుప్తంగా

ఎంపీకి బెయిల్ మంజూరు కావాలని పూజలు



పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గాలివీడు: రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డికి త్వరగా బెయిల్ మంజూరు కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ్ రెడ్డి, ఆవుల సునీతమ్మ, ఆవులనాని కోరారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా పలువురు వైస్సార్సీపీ నాయకులతో కలిసి పేరంపల్లి గ్రామంలో వెలసిన ఆసర్ల గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు పడి పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రసాదాలను అందించారు.

కుట్టు శిక్షణ నిలిపివేత

సుండుపల్లె: మహిళలే ఆర్థిక స్వావలంభన సాధించాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభ దశలోనే నిలిపివేశారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించింది. ప్రారంభించిన మూడు నాలుగు రోజుల్లోనే శిక్షణా కేంద్రాన్ని నిలిపివేశారని మహిళలు తెలిపారు. శిక్షణ ఇచ్చి తరువాత ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని చెప్పి నిలిపివేయడంతో తాము మోసపోయామని తెలిసిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యూరియా కొరతను అధిగమిద్దాం



ఎరువు దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దారు, ఏవో

రాజంపేట రూరల్: రైతులకు అవసరమైన యూరియా నిల్వలను పెంచి కొరతను అధిగమిద్దామని తహశీల్దారు ఎస్.పీర్‌మున్నీ అన్నారు. పలు ఎరువు దుకాణాలను ఏవో నాగలక్ష్మీ కలిసి శుక్రవారం ఆమె తనీఖీ చేశారు. యూరియా నిల్వలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొరత లేకుండా చూసుకోవాలని డీలర్లకు సూచించారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ

రైల్వేకోడూరు అర్బన్: విద్యార్థినులకు ట్రాఫిక్, చైల్డ్ అబ్యూజ్, బాల్య వివాహ చట్టాలపై అవగాహన ఉండాలని సీఐ హేమసుందర్‌రావు అన్నారు. స్థానిక విజడమ్ హైస్కూల్ విద్యార్థినులకు చట్టాలపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తమను తాము రక్షించుకోవడానికి చట్టాలు ఉన్నాయని వివరించారు. ప్రమాదాలు జరగకుండా ఉండడానికి ప్రతి విద్యార్థి చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీసీ రహదారుల నిర్మాణం

పెనగలూరు: పెనగలూరు పంచాయతీ పరిధిలో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నవెంగల్‌రెడ్డి తెలిపారు. బస్టాండు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి స్వీట్ స్టాల్ రాజా ఇంటి వరకు 70 మీటర్లు, నాగిరెడ్డిపల్లిలో 60 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించామని తెలిపారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

స్మార్ట్ మీటర్లపై 5న ధర్నా

మదనపల్లి: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈనెల 5న ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. సెకి ఒప్పందం, అదనపు చార్జీల విధింపు, ఆదానికి భూముల అప్పగింత తదితర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కలికిరి: కలికిరి పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ అనంతరం మిగులు సీట్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ డా. ఎస్.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణులై పాలిటెక్నిక్ కళాశాలలో చేరదలచిన విద్యార్థులు ఈ నెల 4న సోమవారం సాయంత్రం 5 గంటలలోపు నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు పరిశీలన అనంతరం 5న ఉదయం 10 గంటలకు కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరవ్వాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులను అడ్మిషన్ లభిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు 9505504200, 9000498523 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

అంతర్జాతీయ బాక్సింగ్‌లో వీఆర్వో భళా

ఆదరిస్తే.. ఎంతటి క్రీడ అయినా ఇట్టే రాణిస్తామంటున్నారు పల్లె వాసులు. కాస్త శిక్షణ ఇస్తే చాలు.. పతకాలు సాధిస్తామని నిరూపిస్తున్నారు. వారిలో ఒకరు మండ్ల జగదీష్. మండలంలోని మంటపంపల్లికి చెందిన అతడు ఇటీవల జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించి భళా అనిపించాడు.



తను సాధించిన బంగారు పతకాలు, కప్పులతో బాక్సర్ మండ్ల జగదీష్

ఒంటిమిట్ట: నందలూరు సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న మండ్ల జగదీష్ అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో నేపాల్‌పై గెలిచి బంగారు పతకం సాధించారు. మల్లెం కొండయ్య, సుబ్బలక్ష్మమ్మ దంపతులకు జన్మించిన జగదీష్‌కు చిన్న వయస్సు నుంచే బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. నాలుగు నెలల కిందట వరకూ అతడికి బాక్సింగ్ పోటీలలో నియమ నిబంధనలు, ట్రిక్స్ ఏమీ తెలియవు. ఈ సమయంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స కోచ్ గా విధులు నిర్వహిస్తు న్న ఆనందాచారి పరిచయం అయ్యారు. జగదీష్ ప్రతిభ గుర్తించి బాక్సింగ్‌లో మెలుకువలు నేర్పించారు. 2025 మే, 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ గోవాలో జరిగిన 70 నుంచి 75 కేజీల విభాగం నేషనల్ పోటీలకు పంపారు. అక్కడి రాణించడంతో నేపాల్‌లో జులై 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ 75 కిలోల విభాగం బాక్సింగ్ పోటీలకు పంపారు. అక్కడ ఫైనల్‌కు అర్హత సాధించి నేపాల్ దేశంపై గెలుపొంది బంగారు పతకం దక్కించుకున్నారు. ఆ పథకాన్ని తన తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు జగదీష్ తెలిపారు. బాక్సింగ్ ఫీల్డ్‌లోకి ఎలా వచ్చారన్నది జగదీష్ సాక్షితో విషయాలు పంచుకున్నారు.

ఒకే మేనేజ్‌మెంట్ కింద విద్యాశాఖ ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్: విద్యా శాఖ ఒకే మేనేజ్‌మెంట్ కింద ఉండాలని, ఒకే సర్వీస్ రూల్స్ ఉండాలని(ఎన్‌టీఏ) నోబుల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. రాయచోటి డైట్ పాఠశాలలో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ పాఠశాల విద్యా శాఖ అజమాయిషీ(కంట్రోల్)లో ఉన్న పంచాయితీరాజ్, మున్సిపల్ స్కూళ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పదోన్నతులు సమానంగా ఇవ్వాలని కోరారు. 25 ఏళ్లుగా లోకల్ బాడీ స్కూళ్లుగా ఉన్న జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలలకు కావాల్సిన భవనాలు, నిర్వహణ నిధులు, టీచర్ల పర్యవేక్షణతోపాటు పదోన్నతులు స్థానిక సంస్థల ప్రమేయం లేకుండా జరుగుతున్నాయన్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది జీతాలు స్కూల్ ఎడ్యుకేషన్ నిధులతోనే ఇస్తున్నారన్నారు. ఇప్పుడు విద్యాశాఖాధికారి పోస్టును తీసేశారన్నారు. బదిలీల కమిటీలో సీఈవో/ జెడ్పీ చైర్మెన్/ ఎంపీఎల్ కమిషనర్‌ను చేర్చినా వారికి కనీసం ఫైల్ పంపడం లేదన్నారు. తమను ప్రభుత్వ టీచర్లుగా పరిగణించకుండా సవతి తల్లి ప్రేమతో పీఆర్/ఎంపీఎల్ ఉపాధ్యాయులుగా పరిగణించి పదోన్నతులు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ నాయకులు నరసింహారెడ్డి, వేణుగోపాలరావు, శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, మోహన్‌నాయక్, సుబ్బారెడ్డి, శివప్రసాద్, అసదుల్లా, బచ్చల శ్రీనివాసులు, తిరుపతి శ్రీనివాసులు, నాగరాజ, రెడ్డయ్య,రెడ్డెన్న కులశేఖర్ రెడ్డి, వెంకట్రామరాజు రెడ్డయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది



ఉద్యోగిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గాలివీడు : విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్ది, వారి జీవితానికి సార్థకత తీసుకొచ్చే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. గాండ్లపల్లి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు కుడుముల రామకృష్ణారెడ్డి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని కొనియాడారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అంకంశివారెడ్డి, వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా రిటైర్‌మెంట్ ఖరారవుతుందని, దానికి చింతించవలసిన అవసరం లేదన్నారు. అనంతరం రామకృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, పి.రామణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్, జాబీర్, సర్పంచ్ ఉమాపతిరెడ్డి, ఆవుల నాగభూషణ్‌రెడ్డి, వెంకటరమణ, సదాశివరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయచోటి టౌన్: ఎంఈఓ నియామకాల్లో ఉమ్మడి సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలని ఎస్‌టీయూ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు నరసింహులు, పూర్యుడనాయక్ డిమాండ్ చేశారు. డీఈవో డాక్టర్ సుబ్రహ్మణ్యంను శుక్రవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో పనిచేస్తున్న పాఠశాల హాయకులకు మాత్రమే ఎంఈవో-1గా నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సహేతుకం కాదన్నారు. ఇలాగే జరిగితే ఉద్యమానికి కార్యాచరణ ప్రారంభిస్తామన్నారు. అ కార్యక్రమంలో మధుమతి, రామాంజనేయరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజారత్నం, నాగేంద్రబాబు, మల్లికార్జున, వెంకటయ్య, మనోహర్, రాజా, కవిత పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

సిద్ధవటం: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని కడప అర్బన్ సీడీపీఓ జె.వాణిశ్రీ తెలిపారు. మండలంలోని పార్వతీపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరిగి, అలర్జీ ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. అసిస్టెంట్ సీడీపీఓ శోభారాణి మాట్లాడుతూ పుట్టిన గంట లోపే తల్లి పాలు బిడ్డకు పట్టాలన్నారు. తద్వారా తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న దాదిబీ

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని చింతకుంటవాండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ దాదీబీ మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఏడో తేది వరకూ మండల, గ్రామ స్థాయిలలో తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిశువు పుట్టినప్పటి నుంచి రెండేళ్ల వయస్సు వరకూ తల్లి పాలు పట్టించాలన్నారు. అంతకుముందు గర్భిణులకు సీమంతం నిర్వహించి చీరలు, పండ్లు, పసుపు, కుంకుమ, బాలామృతం, బియ్యం పంపిణీ చేశారు. ఆయేషా, స్వప్న, మణి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ప్లాట్లు కేటాయించారు



సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీవైఎస్ పునీత్

మదనపల్లె రూరల్: మొలకలదిన్నె ఆటోనగర్ ప్లాట్ల కేటాయింపులో ఏపీఐఐసీ అధికారులు అవినీతికి పాల్పడి, అనర్హులకు కేటాయించి, అర్హులకు అన్యాయం చేశారని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ ఫిర్యాదు చేశారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీఐఐసీ అధికారుల అవినీతిపై బీవైఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పునీత్ మీడియాతో మాట్లాడుతూ...మొలకలదిన్నె ఇండస్ట్రియల్ ప్లాట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఐఐసీ అధికారులు ఆన్‌లైన్‌లో జారీచేసిన నోటిఫికేషన్‌కు స్పందించి వందల మంది దరఖాస్తుదారులు రూ.2లక్షల 60వేలు చలానా చెల్లించి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఒక ప్లాట్‌కు ఒకరికంటే ఎక్కువ మంది దరఖాస్తుదారులు ఉంటే వేలం నిర్వహించి, ఎవరు ఎక్కువ పాడుకుంటే వారికి ప్లాట్ కేటాయించాల్సి ఉంటుందన్నారు. అయితే ఏపీఐఐసీ అధికారులు, నిబంధనల ప్రకారం వేలం నిర్వహించకుండా, ఎవరైతే వారికి డబ్బులు ఇచ్చారో వారికి ఇష్టారాజ్యంగా ప్లాట్లు కేటాయించారన్నారు. నోటిఫికేషన్‌లో ఎస్సీ కేటగిరీ కింద కేటాయించిన ప్లాట్లను జనరల్ కేటగిరీలోకి మార్చేసి పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడ్డారన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి నిబంధనలకు వ్యతిరేకంగా, అక్రమంగా కేటాయించిన ప్లాట్లను తక్షణమే రద్దుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరికృష్ణ, జిలాని బాషా, నవీన్, శశికుమార్, నిజాం, వినయ్, శ్రీనివాసులు, ద్వారక, జగదీష్, బాలకృష్ణ, సాయికిరణ్, బ్రహ్మ, వెంకటేష్, ఆరిఫ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత గ్రామాలుగా ఎంపిక



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్: టి.సుండుపల్లె మండలం చిన్నబిడికి, వానరాచపల్లె బిడికి, ఆరోగ్యపురం బిడికి గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా, గ్రీన్ విలేజ్‌లుగా ధృవీకరించినట్లు ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా పోలీస్, రెవెన్యూ శాఖ సహకారంతో గ్రామంలో కొందరిని గుర్తించి సారా తయారీకి దూరంగా ఉంచామని పేర్కొన్నారు. సారాను పూర్తిగా నిషేధించగలిగామని, ఆ గ్రామాలను ప్రశాంత వాతావరణంలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఓ.హుస్సేన్‌బాషా, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యేల నివాళి



నివాళులర్పిస్తున్న మోహన్ రెడ్డి, రమేష్ కుమార్‌రెడ్డి, తదితరులు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని మద్దిరేవుల మాజీ సర్పంచ్ మద్దిరేవుల రాజారెడ్డి(75) అనారోగ్యంతో బెంగుళూరులో గురువారం మృతి చెందారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యేలు జి.మోహన్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, తదితరులు శుక్రవారం రాజారెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మద్దిరేవుల రమేష్‌రెడ్డి, సర్పంచులు తుమ్మల చంద్రమ్మ, మల్‌రెడ్డి, యదుభూషణ్‌రెడ్డి, సిద్దక రామచంద్రారెడ్డి, సిద్దక వెంకటరామిరెడ్డి, మద్దిరేవుల సంజీవరెడ్డి, అశోక్‌రెడ్డి, ఎం.యర్రంరెడ్డి, రాఘవరెడ్డి, సుబ్బరాజు, నాగేంద్ర, రామాంజులురెడ్డి, శ్రీనివాసులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఆంక్షలు అడ్డురావు



రాజేశ్వరిరెడ్డి

సిద్ధవటం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న ప్రజాభిమానానికి ముళ్ల కంచెలు, రోడ్డు తవ్వకం, బ్యారికేడ్లు వంటి ఆంక్షలు అడ్డురావని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ ఎమర్జెన్సీని తలపించే విధంగా కూటమి ప్రభుత్వం ఎన్ని కుతంత్రాలు చేసినా అవేం లెక్కచేయకుండా వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు నెల్లూరు పర్యటనను జయప్రదం చేశారన్నారు. కూటమి నేతల బెదిరింపులకు ఎవరూ భయపడరన్నారు. రాబోయే రోజుల్లో ఇంతకుమించి రెట్టింపు ఉత్సాహంతో వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు పనిచేస్తారన్నారు.

సిట్ దర్యాప్తు కోరడం నేరమా ?



మాట్లాడుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

మదనపల్లె రూరల్ : అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధునికొండపై బుద్ధ విగ్రహం ధ్వంసం చేసిన ఘటనపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరడం నేరమా అని సీపీఎం, వీసీకే, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నేతలు ప్రశ్నించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ....ఇద్దరు ముస్లిం మైనర్ పిల్లల ఆటలో బుద్ధుడి విగ్రహం తల విరిగిపోయిందని, వారిలో ఒకరికి మతిస్థిమితం లేదని జిల్లా ఎస్పీ మీడియా సమావేశంలో చెప్పారని, అది నమ్మే విధంగా లేకపోవడంతో తాము సిట్ దర్యాప్తును కోరుతున్నామన్నారు. కోర్టు తీర్పులను సవాల్ చేస్తూ పై కోర్టుల్లో అప్పీల్ చేసుకునే అవకాశం రాజ్యాంగం పౌరులకు కల్పించిందన్నారు. అలాంటప్పుడు ఎస్పీ చెప్పిన విషయంపై అభ్యంతరం తెలిపి ఉన్నత స్థాయి విచారణ కోరే అవకాశం పౌరులకు లేదా అని ప్రశ్నించారు. ఈనెల 9న తలపెట్టిన ధమ్మర్యాలీకి అనుమతి ఇచ్చేది లేదని పోలీసులు బహిరంగ ప్రకటనలు చేస్తుంటే అనుమానం కలుగుతోందని చెప్పారు. ఇంత జరుగుతున్నా...ఎవరూ స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సమావేశంలో పి.శ్రీనివాసులు, ముత్యాలమోహన్, టీఏ.పీర్‌బాషా పాల్గొన్నారు.

హామీలివ్వడం.. మరచిపోవడం బాబుకు అలవాటే

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ఆకేపాటి

ఒంటిమిట్ట: ఎన్నికల సమయంలో హామీలివ్వడం.. అనంతరం మోసాలు చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అలవాటేనని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచగుడిపల్లి పంచాయతీ, గొల్లపల్లి గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి గ్రామంలో ఇంటింటా తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చిన మోసపూరితమైన సూపర్ సిక్స్ పథకాల గురించి గుర్తు చేశారు. ఆకేపాటి మాట్లాడుతూ మోసపూరిత ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించి, వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని కోరారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే, రాష్ట్రాన్ని అమ్మాలన్న మంత్రి అచ్చెయ్యనాయుడుకు హామీ ఇచ్చే సమయంలో అది తెలియదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు



మాట్లాడుతున్న విజయభాస్కర్

రాయచోటి జగదాంబసెంటర్: సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ఏం అభివృద్ధి చేస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయ భాస్కర్ అన్నారు. రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అబద్ధాల హామీలు ఇచ్చి చంద్రబాబు అధికారంలోకి వచ్చాడని.. 14 నెలలు గడుస్తున్నా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. రైతులకు రూ.20వేలు, మహిళలకు ఉచిత బస్సు, చేనేతలు, రజకులు, నాయీబ్రాహ్మణులు, మత్స్యకారులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తానని చెప్పి మొండిచేయి చూపారన్నారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో జగనన్నకు పట్టడం కట్టడానికి జనం సిద్ధమవుతున్నారన్నారు. ఇప్పటికైనా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించడం మానుకోవాలని, జగన్‌కు రక్షణ కల్పిస్తున్న ప్రజలను కట్టుదిట్టం చేయాలనే ఆలోచనను పక్కన పెట్టాలని సూచించారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

లక్కిరెడ్డిపల్లి: పాఠశాల సహాయకులను ఎంఈఓగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ దేవలంపల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మూడే సూర్యుడునాయక్ మాట్లాడుతూ జెడ్పీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులపై కక్ష ఉండరాదని, ఏకపక్షంగా కాకుండా ఉమ్మడి సర్వీస్ రూల్స్ ప్రకారం సమన్యాయం చేయాలని కోరారు. ఎఫ్ఏసీలుగా కాకుండా పదోన్నతుల ద్వారా నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ అడిగితే పీ-4 అమలు చేసే ఉత్తర్వులిచ్చి పక్కదోవ పట్టిస్తున్నారని ఇలాగే కొనసాగితే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. డీఏలు మంజూరు చేయాలని, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సైకం గంగిరెడ్డి, కృష్ణంరాజు, ఆలూరు నాగరాజు, మల్లూరు నాగరాజు, నాగరత్నమ్మ, రాణి, రామ్మోహన్, మదన్ మోహన్ రెడ్డి, రవికుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు

చిట్వేలి: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. చిట్వేలి శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి అలంకరించిన గాజులను భక్తులు అందజేశారు. పాత చిట్వేలి భద్రకాళీసమేత వీరభద్రుడి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు రాహుకాల దీపాలు వెలిగించి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రాహ్మణ వీధిలోని మారెమ్మ, వరదరాజస్వామి, సత్తెమ్మ, ఆలయాలలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యనిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీచక్ర పూజ



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

రాజంపేట టౌన్: మండలంలోని కూచివారిపల్లెలో వెలసిన రామాలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని శ్రీచక్ర పూజ వైభవంగా నిర్వహించారు. అర్చకులు గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మహిళలు పాల్గొని శ్రీచక్ర యంత్రానికి కుంకుమార్చన చేశారు. ఇదిలావుంటే కోదండరామ స్వామికి మహాలక్ష్మీ స్వరూపమైన సీతాదేవి మూల విరాట్‌లను పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించి విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భద్రకాళీ అమ్మవారికి నిమ్మకాయలతో హారతి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



అలంకరణలోభద్రకాళీ అమ్మవారు

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ.రమణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణ స్వామి, రాచరాయయోగీ స్వామి అమ్మవారిని రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అలంకరించారు. వత్తులు వెలిగించి హారతులు పట్టారు.

కోర్టులో గంగమ్మకు అలంకరణ



కోర్టులో గంగమ్మ

మదనపల్లె సిటీ: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణంలో వెలసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. ఆలయం ఎదుట మహిళలు నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి చీర,రవికె, గాజులు, పసుపు, కుంకుమ్మలను సారెగా అందజేశారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితత్రిపురసుందరిదేవి అమ్మవారికి అర్చకులు ఫణికుమార్‌శర్మ పూజలు చేశారు.